సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 18 । డిసెంబర్ । 2023



మట్టి పరీక్ష.. పంటలకు రక్ష

భూసార పరీక్షలతో భూమిలో పోషక విలువల సమత్యులత సాధించవచ్చు. ఈ దిశగా రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టింది. -8లో



కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

వేముల సమీపంలో చెరువు కట్ట వద్ద ఆదివారం స్కూటీని కారు ఢీకొనడంతో శ్రీనివాసులు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.228
రెండోరకం	రూ.80	రూ.158

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 231 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

21న రాష్ట్ర స్థాయి సదస్సు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: విజయవాడలో ఈనెల 21న రాష్ట్ర స్థాయి సదస్సు జరుగనుంది. దీనిని జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి పేర్కొన్నారు. ఆదివారం కడపలోని సిపిఐ కార్యాలయంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆశా కార్యకర్తలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వీరికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించి పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్ ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీబాదుల్లా, జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్యశ్రీ ప్యాకేజీ పెంపు

కడప రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఉచిత వైద్య సేవలను అందించే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఏడాదికి ఒక కుటుంబానికి వైద్య ఖర్చుల కోసం కేటాయించిన రూ 5 లక్షల ప్యాకేజీని ఏకంగా రూ 25 లక్షలకు పెంచారు. అలాగే కొత్తగా రూపొందించిన 'ఆరోగ్య శ్రీ' డిజటల్ కార్డులను పంపిణీ చేయనున్నారు. ఆ మేరకు జిల్లాలో మొత్తం 5.75 లక్షల కుటుంబాలకు కార్డులను అందజేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాలను ప్రారంభిస్తారు.

పుష్పగిరిని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

వల్లూరు: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భానుమతి ఆదివారం పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిని సందర్శించారు. అర్చకులు సుమంత్ దీక్షితులు ఆధ్వర్యంలో ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ చెన్న కేశవ స్వామిని, శ్రీ రాజ్య లక్ష్మీ అమ్మవారిని, సంతాన మల్లేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. పవిత్ర పెన్నా నది ఒడ్డున గల రుద్రపాద ఆలయాన్ని సందర్శించారు. ఆలయ శిల్ప సంపదను పరిశీలించారు.

ప్రవాసాంధ్ర భరోసా బీమాను సద్వినియోగం చేసుకోవాలి

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్‌ఆర్‌టీఎస్) ఆధ్వర్యంలో ప్రవాసాంధ్ర భరోసా బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ ప్రెసిడెంట్ మేడపాటి వెంకట్, డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్ తెలిపారు. ఆదివారం వారు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రవాసాంధ్ర కుటుంబాలకు ఈ బీమా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 2024 జనవరి 15 నుంచి కొత్త పాలసీ వస్తుందని, ప్రీమియం డబ్బులు కూడా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కావున ఇప్పుడున్న మేరకు వలస కార్మికులకు మూడేళ్ల కాలపరిమితితో రూ.550లు నమోదు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకై 2024 జనవరి 15 నుంచి రూ.180లు చెల్లించి బీమా చేసుకోవచ్చన్నారు. ఈ బీమా చేసుకున్నవారు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.10లక్షల పరిహారం వస్తుందని, ప్రమాదం జరిగి ఆపరేషన్ ఇతర ఖర్చులకు బిల్లులు ఇస్తే లక్ష రూపాయల వరకు పరిహారం వస్తుందన్నారు. అలాగే మహిళలకు 9 మాసాల తర్వాత గర్భం వచ్చి సాధారణ కాన్పు అయితే రూ.35వేలు, సిజేరియన్ అయితే రూ.50వేలు ఇస్తారన్నారు.

సురక్షితం.. సౌకర్యవంతం

- జిల్లాలో 10,751 మందికి డాక్టర్ వైఎస్సార్ తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉచిత సేవ
- బాలింతలను సురక్షితంగా ఇళ్లకు చేర్చారు
- జిల్లాలో అందుబాటులో 14 ఎక్స్‌ప్రెస్ వాహనాలు



ఎక్స్‌ప్రెస్ వాహనంలో వాయల్పాడు మండలం జర్రావారిపల్లెకు చెందిన తల్లి బిడ్డ (ఫైల్)



బి.కొత్తకోట: మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. మెరుగైన వైద్యం, ఆస్పత్రుల్లో సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రసవాల కోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరాక ప్రసవానంతరం తల్లి,బిడ్డలను సురక్షితంగా ఇళ్లకు చేర్చుతున్న డాక్టర్ వైయస్సార్ తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన పథకం (102) పైసా ఖర్చు లేకుండా సేవలు అందిస్తోంది. జిల్లాలోని 8 ఏరియా, జిల్లా, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పథకం అమలవుతోంది. ఈ వాహనం ద్వారా తల్లి, బిడ్డ, ఇద్దరు సహాయకులను ఉచితంగా ఆస్పత్రి నుంచి వారి ఇళ్లవద్దకు చేర్చుతారు. ఈ సేవలు పొందడం కోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన తల్లులకే వర్తిస్తుంది. దీనివల్ల బాలింతలు వేలాది రూపాయలు ఆదా పొందుతున్నారు. గర్భిణులకు మెరుగైన వైద్యం కోసం ఆధునాతన వైద్యం అందిస్తున్న ప్రభుత్వం వారిపై అదనపు భారం తప్పించేందుకు ఈ పథకం పకడ్బందీగా అమలు చేస్తోంది.

10,751 మందికి సేవలు

అన్నమయ్య జిల్లాలో 2022 ఏప్రిల్ నుంచి 2023 నవంబర్ వరకు 10,751 మంది బాలింతలను ఆస్పత్రుల నుంచి వారి స్వగ్రామాలకు ఉచితంగా తరలించారు. బి.కొత్తకోట, వాయల్పాడు, కలికిరి, రైల్వేకోడూరు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పీలేరు, రాయచోటి, రాజంపేట ఏరియా ఆస్పత్రులు, మదనపల్లె జిల్లా ఆస్పత్రుల్లో డాక్టర్ వైయస్సార్ తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన పథకం అమలవుతోంది. ఇక్కడ ప్రసవం జరిగిన తల్లి, బిడ్డతోపాటు వారికి సహాయంగా ఉండే ఇద్దరిని వాహనంలో తీసుకెళ్లి ఇళ్లవద్దకు చేర్చుతారు. ఆస్పత్రి నుంచి ఇంటి వద్దకు ఎంత దూరమైనా ఉచితంగానే తీసుకెళ్తారు. పైసా వసూలు చేయరు. వాహనంలో డ్రైవర్ ఒక్కరే ఉంటారు.

ఆ ఇద్దరికి ప్రత్యేకం

హైరిస్క్, రక్తహీనత కలిగిన గర్భిణులకు 102 వాహనాల వినియోగంలో ప్రత్యేకంగా సేవలు అందిస్తారు. హైరిస్క్ కలిగిన గర్భిణులను ఆస్పత్రిలో అడ్మిషన్ కోసం సమాచారం అందుకున్న సిబ్బంది వారిని ఇంటినుంచి ఆస్పత్రి వరకు ఉచితంగా అంబులెన్స్‌లో తరలిస్తారు. అదే రక్తహీనత కలిగిన గర్భిణులను ఎన్నిసార్లయిన ఆస్పత్రులకు తరలించేందుకు అవకాశం ఇస్తారు. వీరు పలుమార్లు రక్తం ఎక్కించుకోవడం, ఐరన్ ఇంజక్షన్లు తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో వారంలో రెండు-మూడుసార్లయినా ఆస్పత్రులకు తీసుకెళ్లి మళ్లీ ఇంటికి తీసుకెళ్తారు. వీరికి ఈ ఏడాది అక్టోబర్ నుంచి సేవలు అందుబాటులోకి తీసుకోస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. పైసా ఖర్చు లేకుండా సేవలు అందిస్తోంది.

104కు కాల్ చేయాలి

వాహన సేవలు పొందడం కోసం హైరిస్క్, రక్తహీనత కలిగిన గర్భిణులు 104కు కాల్ చేశాక 4వ ఆప్షన్ ఎంచుకోవాలి. కాల్ రిసీవ్ చేసుకున్న సిబ్బంది వివరాలను నమోదు చేసుకుని..నిర్ణీత గడువులోగా వారి ఇళ్లవద్దకే వాహనాన్ని పంపిస్తారు. వీరిని ఆస్పత్రుల్లో చికిత్సలు పొందాక తిరిగి ఇళ్లకు తీసుకెళ్తారు. ఆస్పత్రుల్లో చేరి ప్రసవించిన వారు కాల్‌సెంటర్‌కు ఫోన్ చేయాల్సిన అవసరం లేదు. వాహన సేవల వివరాలకు అన్నమయ్యజిల్లా వాసులు 6302270178 నంబర్‌లో సంప్రదించవచ్చని తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్. ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

జిల్లా ఆస్పత్రుల్లో సేవలు, వాహనాలు

ఆస్పత్రి	సేవపొందిన తల్లులు	వాహనాలు
రాయచోటి	1,577	2
రాజంపేట	708	1
రైల్వేకోడూరు	676	1
మదనపల్లె	3,712	4
పీలేరు	2,423	3
కలికిరి	600	1
వాయల్పాడు	533	1
బి.కొత్తకోట	522	1

పైసా ఖర్చు కాలేదు



మొదటి కాన్పు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో జరిగింది. ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చేందుకు డాక్టర్ వైఎస్సార్ తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం అండగా నిలిచింది. 50 కిలోమీటర్లకుపైగా దూరంలో ఉన్న స్వగ్రామం రంగనాథపురానికి నన్ను, పురిటిబిడ్డ, కుటుంబీలను వాహనంలో తీసుకొచ్చి ఇంటివద్ద దింపారు. పైసా ఖర్చు కాలేదు. పురిటిబిడ్డతో ఇంటికి వెళ్లాలని ఇచ్చిన సమాచారంతో ఈ సౌకర్యం కల్పించారు. సురక్షితంగా ఇంటికి పంపిన ప్రభుత్వ సహకారం మరువలేం.

–కే.తేజస్విని, రంగనాథపురం, కలికిరి

క్షేమంగా ఇంటికి చేర్చారు



మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు అయ్యింది. పురిటిబిడ్డతో ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చేందుకు డాక్టర్ వైఎస్సార్ తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ఉపయోగపడింది. మదనపల్లె నుంచి 45 కిలోమీటర్ల దూరంలోని స్వగ్రామం గుర్రంకొండ మండలం చెర్లోపల్లెకు తీసుకొచ్చారు. ఈ రవాణా కోసం పైసా కూడా ఖర్చు కాలేదు. వాహన డ్రైవర్ మమ్మల్ని క్షేమంగా ఇంటికి తీసుకొచ్చారు. ఇలాంటి సౌకర్యం పేదలకు ఎంతో ఉపయోగంగా ఉంది.

–సి.లక్ష్మిదేవి, చెర్లోపల్లె, గుర్రంకొండ

డాక్టర్ సతీష్‌రెడ్డికి ఎక్స్‌లెన్స్ అవార్డు



డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ ఎక్స్‌లెన్స్ అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ సతీష్‌రెడ్డి

కడప రూరల్: జిల్లాలోని పులివెందులకు చెందిన డాక్టర్ సతీష్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యాక్ట్ నౌ ఆర్గనైజేషన్ నిర్వాహకులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ ఎక్స్‌లెన్స్ అవార్డుతో సత్కరించారు. సతీష్‌రెడ్డి వైద్య వృత్తిలో భాగంగా పలు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. పేదలకు అధునాతన వైద్య సేవలను అందించారు. అలాగే కోవిడ్ సమయంలో కీలకమైన వైద్య సేవలను అందజేశారు. గ్యాస్ట్రో, సర్జరీ విభాగంలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను డాక్టర్ సతీష్‌రెడ్డికి ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ తనకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నా రు. ఈ అవార్డు కారణంగా తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. భవిష్యత్తులో వైద్య సేవా కార్యక్రమాలను విరివిగా చేపడతామని అన్నారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: ప్రముఖ శైవక్షేత్రం మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచిఉదయం 5 గంటలకు బయలుదేరి నేరుగా మల్లయ్యకొండకు చేరుకుని అక్కడి నుంచి మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. ఉదయం 5.30, 6.30 గంటల బస్సులు మదనపల్లె నుంచి తంబళ్లపల్లెకు చేరుకుని అక్కడి నుంచి మల్లయ్యకొండకు షటిల్ సర్వీసులు తిప్పుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

పల్లె మురిసింది.. నెలగంట మోగింది

- విష్ణుమూర్తికి ప్రీతిపాత్రం... ధనుర్మాసం
- వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు

మదనపల్లె సిటీ: తెలుగు ప్రజలకు ధనుర్మాసం అత్యంత ప్రీతిపాత్రమైంది. సంక్రాంతి నెల మొదలు కావడంతో పంటలు చేతికి వచ్చి గృహాలన్నీ ధాన్య, ధన రాసులతో తులతూగే మాసంగా దీనికి ప్రత్యేక స్థానం ఉంది. సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించగానే ఆలయాల్లో మోగించే గంటా నాదాన్నే నెల గంట అంటారు. ఈనెల 17వతేదీ నుంచి ధనుర్మాసం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెలలో శుద్ధ ఏకాదశిని ముక్కోటిగా పిలుస్తారు. ధనుర్మాసంలో అన్ని విష్ణు ఆలయాల్లో నెల రోజుల పాటు తిరుప్పావై పాశురాలను పఠిస్తారు. ఈ మాసంలో విష్ణుమూర్తిని మధుసూధనుడిగా పూజిస్తారు. మొదటి 15 రోజుల చక్కర పొంగలి నైవేద్యంగా, తర్వాత 15 రోజుల దద్దోజనం సమర్పిస్తారు.

నెల రోజుల పాటు ఉత్సవాలు

ఆదివారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి.ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతవరణం నెలకొంది. ఉత్సవాలు జనవరి 14 వరకు జరుగుతాయి. ధనుర్మాస వ్రతాలను కూడా ఆచరిస్తారు. ఆలయాల్లో నిత్యం ఉదయం సుప్రభాతం, మంగళవాయిద్యాలు, తిరుప్పావై గానం, ఆండాల్ కోవెల సేవ జరుపుతారు.



మదనపల్లె ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో గోదాదేవికి పూజలు

ప్రతి శుక్రవారం గోదాదేవికి కంకుమార్చన చేస్తారు. జనవరి 14 మకర సంక్రాంతి పండుగ రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

- ధనుర్మాస పూజలు ఆదివారం జిల్లాలో వైష్ణవాలయాల్లో ప్రారంభమయ్యాయి. మదనపల్లె పట్టణం శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి, బర్మావీధిలోని షిర్డి సాయిబాబా ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయంలోని రంగనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డిసాయిబాబా ఆలయంలో భక్తులు పాశురాలు ఆలపించారు. వాల్మీకిపురంలోని పట్టాభిరామాలయం, తరిగొండలోని లక్ష్మి నరసింహస్వామి ఆలయం, నందలూరులోని సౌమ్యనాథస్వామి ఆలయం, ఒంటిమిట్టలోని కోదండరామస్వామి ఆలయం, రాయచోటిలోని వీరభద్రస్వామి ఆలయాల్లో ధనుర్మాస పూజలు చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

ఎంతో శుభప్రదమైనది



భక్తురాలు గోదాదేవి రంగనాథుడిని స్తుతిస్తూ రోజుకో పాశురాన్ని 30 రోజుల పాటు గానం చేసినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. 30వ రోజున గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణం నిర్వహిస్తారు. పాశురాలు పఠించినా, విన్నా, గోదా కల్యాణం తిలకించినా శుభాలు కలుగుతాయి.

–శివకుమార్‌శర్మ, వేదపండితులు,మదనపల్లె

చరిత్రలో నిలిచిపోయిన రారాజు శ్రీకృష్ణదేవరాయలు



శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఎమ్మెల్యేలు, బలిజ జేఏసీ సభ్యులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


మదనపల్లె: బలిజల ఆరాధ్యదైవమైన శ్రీ కృష్ణదేవరాయలు మంచి పరిపాలనా దక్షుడిగా, నీతికి, నిజాయితీకి మారుపేరుగా, సమైక్యతా భావాలను పెంపొందించిన మహనీయుడిగా అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచి చరిత్రలో నిలిచిపోయిన రారాజు అని గనులు, విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. బలిజ జేఏసీ మదనపల్లె అధ్యక్షుడు వైఎస్.మునిరత్నం ఆధ్వర్యంలో మండలంలోని బసినికొండ పంచాయతీ పుంగనూరు బైపాస్‌రోడ్డు వై జంక్షన్‌లో ఏర్పాటుచేసిన శ్రీ కృష్ణదేవరాయల కాంస్య విగ్రహాన్ని ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు నవాజ్‌బాషా, పెద్దిరెడ్డిద్వారకనాథరెడ్డి, ఆరణిశ్రీనివాసులు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపాశేషు, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ పోకలఅశోక్‌కుమార్, కర్ణాటక కైవారం శ్రీక్షేత్ర ధర్మాధికారి ఎం.ఆర్.జయరామయ్య తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ...మదనపల్లె బైపాస్‌రోడ్డు జంక్షన్‌లో అందరూ చూసేలా ఆంధ్రభోజ శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. కొద్దినెలల ముందే పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌లో ఓ విగ్రహాన్ని ఏర్పాటుచేశామని, ఇప్పుడు రెండోది ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. రాయల కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, చంద్రగిరికోట, తిరుపతి రాయలచెరువు ఆయన హయాంలో నిర్మితమై నేడు రైతులకు పూర్తిస్థాయిలో సేవలందిస్తోందని అన్నారు.బలిజల ఆరాధ్యదైవం శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలను తమ మనోభావాలకు తగ్గట్లుగా ఏర్పాటు చేసుకుంటామని కోరితే ఉచితంగా అందజేస్తామని ఎంపీ మిథున్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ..బలిజల 30 ఏళ్ల కలను సాకారం చేస్తూ పట్టణనడిబొడ్డున, బైపాస్ రోడ్డు జంక్షన్‌లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారం అందించారన్నారు. బలిజ కులస్తులు తమ చల్లనిదీవెనలు వారికి అందించి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు మాట్లాడుతూ..బలిజల కలను నెరవేర్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ప్రభుత్వానికి బలిజలు జీవితాంతం రుణపడి ఉంటారన్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ... బలిజలకు అండగా నిలుస్తామన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపాశేషు మాట్లాడుతూ..రాష్ట్రంలో మరే ఇతర కులాలకు లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాపునేస్తం పథకాన్ని ప్రవేశపెట్టి ఇప్పటి వరకు రూ.2వేల కోట్లు ఇచ్చిందన్నారు. కాపు,బలిజ,తెలగ, ఒంటరి కులాలకు సీఎం జగన్ నేతృత్వంలో డీబీటీ పద్ధతిలో 40వేల కోట్లు వరకు నిధులు జమకావడం జరిగిందన్నారు. వైజాగ్, తిరుపతి పట్టణాల్లో కాపుభవన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. బలిజకులస్తులు ఆజన్మాంతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీకి రుణపడి ఉంటామన్నారు. టీటీడీ బోర్డు మాజీ మెంబర్ పోకలఅశోక్‌కుమార్ మాట్లాడుతూ.. బలిజలకు పదవులు, పనులు, గౌరవం కల్పించిన నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని అన్నారు. అంతకుముందు బలిజయువత ఆధ్వర్యంలో పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రింగ్‌రోడ్డు నుంచి బసినికొండ వై జంక్షన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సభ అనంతరం శ్రీకృష్ణదేవరాయల విగ్రహ దాతలు కత్తికృష్ణమూర్తి, కత్తి రాజకిషోర్‌చంద్రదేవ్, సవరాలకృష్ణమూర్తి, లక్ష్మీదేవమ్మలను సన్మానించారు. విగ్రహావిష్కరణకు కర్ణాటక, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్యజిల్లాలతో పాటు రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని పుంగనూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో బలిజకులస్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో డీకే.ఆదికేశవులు నాయుడు కుమార్తె తేజస్విని, రాష్ట్ర యువకాపునాడు అధ్యక్షులు మిద్దింటికిషోర్, అమరనాథ్, జిల్లా యువజనవిభాగం బండ్లలక్ష్మీపతి, సర్పంచ్‌లు ఆనందపార్థసారధి, చిప్పిలిచలపతి, ఆకులగజేంద్ర, డీసీసీ మాజీ అధ్యక్షులు సుధాకర్, బలిజజేఏసీ కమిటీ సభ్యులు రేగడప్రసాద్‌కుమార్, ఎస్.భాస్కర్(మహర్షి), కత్తి లక్ష్మన్న, ఆకులకృష్ణమూర్తి, గుండాలరామచంద్ర, బొంతలజయరాం, జంగాలశివరాం, కూరాకుల ఆంజనేయులు, అండేశివప్రసాద్, రెడ్డిశశికుమార్, మిద్దింటిశంకరనారాయణ, బోర్‌వెల్‌సుధ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలాగ్జింతో గుండె ధైర్యం



- గుండెపోటుకు తక్షణ ఉపశమనం
- ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులోకి తెచ్చిన సీఎం జగన్
- రూ. 51,669 విలువైన ఇంజెక్షన్ పూర్తిగా ఉచితం





ఎలాగ్జిం ఇంజెక్షన్

పీలేరు: ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా ఏ వయస్సు వారికైనా గుండెపోటు (హార్ట్ స్ట్రోక్)రావడం సర్వసాధారణంగా మారింది. సమయానికి వైద్యం అందకపోతే నిండు ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి. ఇలాంటి తరుణంలో గుండెపోటు వచ్చిన వారికి తక్షణ ఉపశమనం కల్పించి పెద్ద ఆస్పత్రికి వెళ్లేంతవరకు ప్రాణాలను కాపాడటానికి ప్రభుత్వం ఎలాగ్జిం ఇంజెక్షన్‌ను ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో తెచ్చింది. గతంలో కేంద్ర ప్రభుత్వం ఐసీఎంఆర్ ప్రాజెక్టు కింద కొన్ని కొన్ని ఆస్పత్రులకు మాత్రమే ఇంజెక్షన్ అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గుండెపోటుతో ఎవరూ మరణించరాదని, పేదలను సైతం ఆదుకోవాలని భావించి అన్ని ఏరియా ఆస్పత్రుల్లో ఎలాగ్జిం ఇంజెక్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. మొదట్లోపైలట్ ప్రాజెక్టుగా ఉమ్మడి చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల్లో అమలు చేశారు. అనంతరం గుంటూరు, వైజాగ్ జిల్లాల్లో అమలు చేశారు. క్రమంగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడానికి చర్యలు చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 24 ఏరియా ఆస్పత్రుల్లో ఎలాగ్జిం ఇంజెక్షన్ అందుబాటులో ఉంది. ఒక్క పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఏడాది కాలంలో తొమ్మిది మందికి ఎలాగ్జిం ఇంజెక్షన్‌తో ప్రాణాలు కాపాడారు.

ఎలాగ్జింతో గంటసేపు ప్రాణాలు కాపాడవచ్చు



గుండెపోటు గురైన వారు సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి చేరాలి. ప్రభుత్వాస్పత్రిలో ఎలాగ్జిం ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా తక్షణం ప్రాణాలు కాపాడటంతోపాటు గంట సమయంలో ఉన్నతాసుపత్రికి వెళ్లడానికి రక్షణగా పని చేస్తుంది. రెండోసారి గుండెపోటు రాకుండా ప్రాణాలను కాపాడుకోవచ్చు. అత్యవసర సమయంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ డేవిడ్ సుకుమార్, డీసీహెచ్‌ఎస్, రాయచోటి

అవసరమనిపిస్తేనే ఇంజెక్షన్ వాడతాం



గుండెపోటుతో ప్రభుత్వాస్పత్రికి వచ్చిన రోగిని పరీక్షించిన అనంతరం వారి కండీషన్‌ను బట్టి ఎలాగ్జిం ఇంజెక్షన్ ఇస్తాం. విలువైన ఇంజెక్షన్ కావడంతో వృథా చేయకుండా తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఎలాగ్జిం వాడడం జరుగుతుంది.

– డాక్టర్ చంద్రశేఖర్, పీలేరు ప్రభుత్వాస్పత్రి సూపరింటిండెంట్

జగనన్నకు రుణపడి ఉంటాం



నాకు గుండెపోటు రావడంతో తక్షణం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎలాగ్జిం ఇంజెక్షన్ ఇచ్చారు. పెద్ద ఆస్పత్రికి వెళ్లే వరకు నా ప్రాణాలు కాపాడింది. ఆస్పత్రిలో ఎలాగ్జిం ఇంజెక్షన్ అందుబాటులో ఉంచిన ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం.

– మమత, పీలేరు

విలువైన ఇంజెక్షన్ ఉచితంగా అందించారు



గుండెపోటికు గురైన నన్ను స్నేహితులు పీలేరు ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో తక్షణ ఉపశమనం కోసం రూ. 51,669 విలువైన ఇంజెక్షన్ ఉచితంగా అందించారు. నా ప్రాణాలు కాపాడిన వైద్యులకు, ముఖ్యమంత్రికి రుణపడి ఉంటా.

– సురేంద్ర, పీలేరు

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన ఆదివారం రామసముద్రం మండలంలో జరిగింది. పూలకుంటవారిపల్లెకు చెందిన రంగప్ప భార్య ఎల్.సావిత్రి(35) భర్త మందలించడంతో మనస్తాపం చెంది ఇంటి వద్దే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. రామసముద్రం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కరెంట్ షాక్‌తో మహిళకు గాయాలు

మదనపల్లె : కరెంట్ షాక్‌తో మహిళా కూలీ గాయపడిన సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో జరిగింది. కంటేవారిపల్లెకు చెందిన రెడ్డెప్ప భార్య పి.రమణమ్మ(45) స్థానికంగా కూలిపనులకు వెళుతూ జీవిస్తోంది. యథావిధిగా ఆదివారం గ్రామానికి సమీపంలో వ్యవసాయ కూలి పనులకు వెళ్లగా, పనులు చేసే క్రమంలో అక్కడ కరెంట్‌షాక్‌కు గురైంది. గమనించిన స్థానికులు ఆమెను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటోంది.

ఏఎంసీ మాజీ డైరెక్టర్ డాక్టర్ బి.వెస్లీ మృతి



మదనపల్లె : ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ (ఏఎంసీ) మాజీ డైరెక్టర్ డాక్టర్ బోనం వెస్లీ (71) గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం సాయంత్రం క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఓ సమావేశంలో మాట్లాడుతున్న ఆయన ఉన్నట్లుండి హఠాత్తుగా కిందపడిపోయారు. గమనించిన కుటుంబీకులు ఆయనను ఆస్పత్రికి చేర్చేలోపు గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రఖ్యాత క్షయవ్యాధి నివారణ కేంద్రంగా పేరు మోసిన ఆరోగ్యవరం మెడికల్ సెంటర్(శానిటోరియం)కు 33 ఏళ్లపాటు డైరెక్టర్‌గా డాక్టర్ .బి.వెస్లీ సుదీర్ఘ సేవలందించారు. శానిటోరియం ప్రతిష్టను పెంచడంలో, టీబీ నివారణకు సంబంధించి పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్లో డాక్టర్ బి.వెస్లీ తనదైన సేవలందించారు. డాక్టర్ వెస్లీ సతీమణి షీలా వెస్లీ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. అలాగే ఆయన కుమారుడు రిచర్డ్ వెస్లీ ఆరోగ్యవరంలో వైద్యుడిగా సేవలందించారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

వేముల: మండలంలోని వేముల సమీపంలో చెరువు కట్ట వద్ద ఆదివారం స్కూటీని కారు ఢీకొనడంతో శ్రీనివాసులు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందులకు చెందిన పూల శ్రీనివాసులు కడప రిమ్స్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో విధులు పూర్తి చేసుకుని స్కూటీపై పులివెందులకు బయలు దేరాడు. వేముల సమీపంలోని చెరువు కట్ట వద్దకు రాగానే వేంపల్లె వైపు వస్తున్న కారు స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులుకు తీవ్ర గాయాలు కాగా స్కూటీ పూర్తిగా కాలి పోయింది. గాయపడిన వ్యక్తిని పులివెందుల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కడపకు తీసుకెళ్లారు. ఈ సంఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో దగ్ధమవుతున్న స్కూటీ

మట్టి పరీక్ష.. పంటలకు రక్ష

- జిల్లాలో ముగిసిన భూసార పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 10850 మట్టి నమూనాల సేకరణ
- భూమిలో సమతుల్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యం



భూసార పరీక్షల నిమిత్తం పొలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు



కడప సాయిల్ టెస్ట్ సెంటర్‌కు పంపేందుకు మట్టి నమూనాలను సిద్ధం చేసిన ఆర్బీకే సిబ్బంది

గుర్రంకొండ : భూసార పరీక్షలతో భూమిలో పోషక విలువల సమత్యులత సాధించవచ్చు. ఈ దిశగా రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం భూసార పరీక్షలకు మూడు నెలల క్రితం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం జిల్లా మొత్తం 10,850 మట్టి నమూనాలను సేకరించారు. వీటిని కడపలో సాయిల్‌టెస్ట్ సెంటర్‌కు పంపనున్నారు. భుసార పరీక్షల ఫలితాల ద్వారా.. సారం కోల్పోయిన భూమిలో పోషక విలువల సమతుల్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యం. తద్వారా పంటల సాగులో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఆర్బీకేల్లో ప్రారంభమైన మట్టి సేకరణ పనులు విజయవంతంగా పూర్తి అయ్యాయి.

ఏడాది, మూడేళ్ల కొకమారు భూసార పరీక్షలు

నీటి సౌకర్యం అనగా బోర్లు, బావులు, సాగునీటి కాలువల ద్వారా ఏడాది పొడవునా నీటి సౌకర్యం ఉన్న పొలాల్లో ఏడాదికొకమారు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలి. ప్రతి మూడు సీజన్‌ల కొకమారు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల రైతుకు మంచి ఫలితాలు వచ్చే అవకాశముంది. వర్షాధార పంటల సాగు భూముల్లో అనగా కేవలం ఏడాది పొడవునా కురిసే వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేసే మెట్ట భూముల్లో మూడేళ్ల కొకమారు భుసార పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. రైతులు పంటలు సాగు చేసిన ప్రతి సారి భూమిలో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటుంది. భూసార పరీక్షలో భూమిలో ఎంత మేరకు వీటి శాతం తగ్గిందో తెలుసుకోవచ్చు. తద్వారా పంట సాగు చేసే ముందు పొలంలో తగినంత మేరకు వీటిని పిచికారీ చేస్తే భూసారం మళ్లీ యథాస్థితికి చేరుకొని మంచి పంట దిగుబడులు సాధించవచ్చు. భుసార పరీక్షలు చేయించుకోవడం వలన పొలం గుల్ల బారిపోకుండా జాగ్రత్త పడవచ్చు.

ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభాలు అనుకూలం

భూసార పరీక్షల కోసం పొలాల్లో గానీ, భూమిలో గానీ మట్టి నమూనాలను సేకరించేందుకు ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభ సమయాలు చాలా అనుకూలంగా ఉంటాయి. ఏడాదిలో ఈ రెండు సీజన్‌ల ప్రారంభ సమయాల్లో చాలా వరకు పొలాల్లో పంటల సాగు ఉండదు. దీంతో బీడు భూములు అధికంగా ఉంటాయి. అప్పుడు మట్టి నమూనాలు సేకరిస్తే కచ్చితమైన ఫలితాలు వస్తాయనేది వ్యవయసాయాధికారుల నమ్మకం. బీడు భూములపై ఉన్న పిచ్చిమొక్కలను, గడ్డిని తొలగించి అక్కడ మట్టి నమూనాలను సేకరిస్తారు.

ఎనిమిది చోట్ల మట్టి సేకరణ

భూసార పరీక్షల్లో భాగంగా ఒక పొలంలో ఎనిమిది చోట్ల మట్టి నమూనాలను సేకరిస్తారు. అవి వర్షాధార భూములైనా సరే, నీటి సౌకర్యం ఉన్న పొలాలైనా సరే మట్టిసేకరణ విధానం ఒకేలా ఉంటుంది. పొలం నలుమూలల ఎనిమిది చోట్ల వీ ఆకారంలో తవ్వి ఒక చోట అర కిలో చొప్పున మట్టిని నమూనాను సేకరిస్తారు. తరువాత మట్టి మొత్తాన్ని ఒకే చోట కలిపి భూసార పరీక్షలు చేస్తారు. తద్వారా పొలంలో పోషకాలు ఎంత మేరకు ఉన్నాయో తెలిసే అవకాశముంటుంది.

జిల్లా వ్యాప్తంగా 10850 నమూనాల సేకరణ

భూసార పరీక్షల నిమిత్తం జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్బీకేల పరిధిలో మొత్తం 10850 మట్టి నమూనాలను సేకరించారు. గత మూడు నెలలుగా జిల్లాలోని వ్యవసాయ శాఖ, ఆర్బీకే సిబ్బంది రైతుల పొలాల్లో నుంచి మట్టి సేకరించారు. వీటిని మండల కేంద్రాల్లోని వ్యవసాయ కార్యాలయాల్లో భద్రపరిచారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి మట్టి నమూనాలను కడపలోని సాయిల్ టెస్టింగ్ సెంటర్‌కు తరలించనున్నారు.

21 రోజుల్లో ఫలితం

భూసార పరీక్షల నిమిత్తం సేకరించిన మట్టి నమూనాల ఫలితాలను 21 రోజుల తరువాత ప్రకటిస్తారు. ఆర్బీకే సిబ్బంది భూసార పరీక్షల ఫలితాన్ని సదరు పొలం రైతుకు తెలియజేస్తారు. తద్వారా సదరు పొలంలో నత్రజని, పొటాష్, భాస్వరం, కాల్షియం, ఐరన్‌తోపాటు ఉదకజనిక సూచిక, సేంద్రీయ కర్బనం వంటివి ఎంత మేరకు ప్రస్తుతం భూమిలో ఉన్నాయో ఫలితాలు సూచిస్తాయి. దీంతో పొలంలో భుసారాన్ని పెంపొందించేందుకు ఎలాంటి పోషక విలువలు కలిగిన ఎరువులు వాడాలో వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తారు.

స్థూల, సూక్ష్మపోషకాల సమతుల్యత

పంటలు సాగు చేసే పొలాలు, చేలల్లో స్థూల, సూక్ష్మ పోషకాల సమతుల్యత భూసార పరీక్ష ద్వారా సరి చేసుకోవాల్సి ఉంటుంది. పొలాల్లో దుక్కులు చేసే, విత్తనాలు వేసే సమయంలో సూక్ష్మ పోషకాల మందులను వినియోగించాల్సి ఉంటుంది.

బోరాన్, సల్ఫర్ : పంట సాగులో బోరాన్, సల్ఫర్‌ను తప్పనిసరిగా వినియోగించాలి. తద్వారా కాయలు నాణ్యతగా వస్తాయి. వాటి బరువు కూడా పెరుగుతుంది.

జింక్ : జింక్ వినియోగించడం వల్ల మొక్కల్లో కాండం, మొక్క ఎదుగుదల ఎక్కువగా, దృఢంగా ఉంటాయి. అంతేకాకుండా కాయల్లో గింజ ఏర్పడే శాతం కూడా పెరుగుతుంది.

జిప్సం : పొలాల్లో జిప్సం చల్లడం వలన గింజల్లో నూనె శాతం ఎక్కువగా ఏర్పడుతుంది. పంట పొలాలు దుక్కులు చేసే సమయంలో ఎకరానికి 200 కేజీల జిప్సం చల్లాలి.

రెండు రెట్లు అధిక దిగుబడి

భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాలు తెలుసుకోవడం వలన పంటల సాగులో మంచి ఫలితాలు సాధించవచ్చు. భూమిలోగానీ, పొలంలో గానీ ఉన్న లోపాలు భూసార పరీక్ష ఫలితాల్లో తెలిసిపోతుంది. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అప్పటి వరకు సదరు పొలంలో సాగు చేసే పంటల దిగుబడి కన్నా.. రెండు రెట్లు అధికంగా దిగుబడులను రైతులు సాధించే అవకాశంఉంటుంది.

భూసార పరీక్షలతో ఎంతో మేలు



భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల రైతుకు ఎంతో మేలు జరుగుతుంది. భూమిలో పోషక విలువలు ఎంత మేరకు ఉన్నాయో ఈ పరీక్షల ద్వారా తెలిసిపోతుంది. తద్వారా భూములు, పొలాల్లో లోపించిన పోషక విలువలను సరిచేసుకొనే అవకాశాన్ని రైతులకు ప్రభుత్వం కల్పించడం హర్షణీయం.

\- మల్లికార్జున, రైతు, గుర్రంకొండ

మట్టి నమూనాలు సేకరించాం



గ్రామాల్లోని ఆర్బీకే సిబ్బంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. 21 రోజుల తరువాత భూసార పరీక్షల ఫలితాలు రైతులకు తెలియజేస్తాము. సదరు రైతు పొలంలో ఉన్న లోపాలను తెలియజేసి సరిచేసుకునేందుకు సూచనలు, సలహాలు వారికి ఇస్తాము. ఇవి రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయి.

\- రత్నమ్మ, వ్యవసాయాధికారి, గుర్రంకొండ

సారవంతంగా మార్చుకోవచ్చు



భూసార పరీక్షలతో పొలాలు, భూములు సారవంతంగా మార్చుకోవచ్చు. చాలా సంవత్సరాలుగా భూసార పరీక్షలు నిర్వహించే కార్యక్రమం జరగలేదు. భూసార ఫలితాల కార్డులను రైతులకు అందజేస్తాము. తద్వారా గుల్లబారిపోయిన భూములు భూసార పరీక్షలతో సారవంతంగా మార్చుకొనే అవకాశముంది. అధిక పంట దిగుబడులు సాధించవచ్చు.

\- వాణిశ్రీ, ఏడీఏ, వాల్మీకిపురం

తెగిన శీతివారిపల్లె చెరువు



పంటలు నష్టపోయిన రైతు భూపాల్ రెడ్డి



పిచ్చలవాండ్లపల్లె గ్రామంలో తెగిన శీతివారిపల్లె చెరువు

చేతికి వచ్చిన పంటలు నష్టపోయిన రైతులు

కురబలకోట : కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె గ్రామం దిగువశీతివారిపల్లెను ఆనుకుని ఉన్న శీతివారిపల్లె చెరువు ఆదివారం సాయంత్రం తెగిపోయింది.

హంద్రీనీవా కాలువ ద్వారా ప్రవహిస్తున్న కృష్ణా జలాల లీకేజీ నీళ్లతో ఈ చెరువు నిండింది. ఇన్నాళ్లు నిండు కుండలా ఉన్న చెరువు ఒక్కసారిగా తెగిపోవడంతో గ్రామస్తులు, ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు. ఆ ఊరికి సమీపంలో ఇదివరలో ఈ చెరువు కిందగా మట్టి తీశారు. దీంతో ఈ చెరువు కట్ట దెబ్బతిని తెగిందని గ్రామస్తులు చెబుతున్నారు. తెగిన చెరువుతో ఆ గ్రామ రైతు భూపాల్ రెడ్డి ఎక్కువగా నష్టపోయారు. రెండు ఎకరాలకు పైగా ఉన్న వేరుశనగ, వరి లాంటి పంటలు మొత్తం నష్టపోవాల్సి వచ్చిందని రైతు వాపోతున్నాడు. అలాగే శంకర్‌రెడ్డి తదితర రైతుల పంటలు కూడా దెబ్బతిన్నాయి. తెగిన శీతివారిపల్లె చెరువు నీళ్లు దిగువన ఉన్న అప్పాలమ్మ చెరువుకు చేరుతున్నాయి. ఇదివరకే ఆ చెరువు కూడా నిండి మొరవ పోతుండడంతో దిగువన ఉన్న బయ్యమ్మ చెరువు ద్వారా కోసువారిపల్లె వైపు ప్రవహిస్తున్నాయి. అధికారులు అప్రమత్తం చేశారు.

కోనేరులో పడి బాలుడి మృతి



తేజసూర్య (ఫైల్)



కోనేటిలో మునిగి మృతి చెందిన బాలుడు తేజసూర్య మృతదేహం

మదనపల్లె : ప్రమాదవశాత్తు ఓ బాలుడు కోనేరులో పడి మృతిచెందిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు.. సీటీఎం పంచాయతీ చెంచులక్ష్మి ఎస్టీ కాలనీ పడమర బజారులో నివాసం ఉన్న నాగరాజ, భూదేవి దంపతులకు తేజసూర్య(6), ఆదిత్య(4) ఇద్దరు కుమారులు ఉన్నారు. నాగరాజ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి నాగరాజ పెద్ద కుమారుడు తేజసూర్య ఇంటివద్ద కనపడకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. స్థానికంగా వెతుకుతూ, రాత్రి తాలూకా పోలీసులకు బాలుడి అదృశ్యంపై సమాచారం అందించారు. తాలూకా సీఐ శేఖర్, ఎస్‌ఐలు సుధాకర్, రవికుమార్ గ్రామానికి చేరుకుని, బాలుడి ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో తెల్లవారుజాము వరకు గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం 10 గంటలకు గ్రామానికి సమీపంలోని శివాలయం కోనేరులో బాలుడి మృతదేహం తేలియాడుతూ ఉండటాన్ని గుమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలిపారు.తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో పోలీస్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. కనిపించకుండా పోయిన తమ కుమారుడు ఇక ఎప్పటికీ కనిపించడన్న విషాదంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్నేహితులతో కలిసి ఆడుకుంటూ కోనేరు వద్దకు వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు అందులో పడిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు, పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

\- సాక్షి నెట్‌వర్క్

జగనన్న సురక్షతో ఉచితంగా సర్టిఫికెట్లు



గతంలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగేవాళ్లం. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మా వలంటీర్ మా ఇంటికి వచ్చి ఆధార్ కార్డు, రేషన్ కార్డులు తీసుకెళ్లి ఉచితంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను తయారు చేయించారు. మా గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారుల ద్వారా మాకు సర్టిఫికెట్లను అందజేశారు. సర్టిఫికెట్ల కోసం ఆఫీసుల చుట్టూ తిరగకుండా జగనన్న సురక్ష కార్యాక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయనకు మేము ఎప్పటికీ ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాము.

\- బి. వైశాలి, బీఎస్సీ విద్యార్థిని, గాంధీవీధి, సిద్దవటం

సొంత ఇంటి కలను నెరవేర్చిన సీఎం జగన్



నాకు వివాహం అయ్యి దాదాపు 12 సంవత్సరాలు అయినప్పటి నుంచి నాకు ఇల్లు మంజూరు కాలేదు. కాని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చి, అందులోనే హౌసింగ్ తరపున ఇంటిని కూడా మంజూరు చేయించారు. నాకు ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సొంత ఇంటి కలను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నెరవేర్చారు. ఆయనకు ధన్యవాదాలు.

-రేవతి, కోదండరామనగర్, ఒంటిమిట్ట

ధైర్యంగా పిల్లలను చదివించుకుంటున్నాను



మేము బేల్దారి పని చేసుకొని జీవనం సాగించేవాళ్లం. గతంలో పిల్లలను చదివించాలంటే ఆర్థికంగా ఇబ్బంది పడేవాళ్లం. కాని ఇప్పుడు అమ్మ ఒడి డబ్బులు పిల్లల చదువులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాయి. పిల్లలను ధైర్యంగా చదివించుకుంటున్నాం. అమ్మ ఒడి పథకం మాకు ఎంతగానో ఉపయోగ పడుతోంది.

\- కోటగొండ్ల శోభ, గజ్జలవారిపల్లి, రైల్వేకోడూరు

హౌసింగ్ అధికారుల అవినీతిపై ఏసీబీ విచారణ

- కింది స్థాయి ఉద్యోగుల నుంచి రూ.లక్షలు వసూళ్లపై ఆరా
- క్లర్కులు, అటెండర్‌ల ఫోన్‌పేలు, బ్యాంక్ అకౌంట్ల పరిశీలన
- వర్క్ ఇన్‌స్పెక్టర్‌పై కేసు నమోదు

రాయచోటి : హౌసింగ్ శాఖలో ఇంటి దొంగల గుట్టు రట్టు అవుతోంది. ఎంద్రకాయ్ బలుపు ఎక్కితే బొరకలో ఉండదు అన్న పెద్దల సూక్తిని నిజం చేస్తూ హౌసింగ్ శాఖలో పేదల సొమ్మును బొక్కిన అధికారులు పంపకాల్లో తేడా వచ్చిందో.. లేక బొక్కేసిన డబ్బును దాచుకోలేకపోయారో.. తెలియదు కానీ అవినీతి చేపల బాగోతం రోడ్డెక్కింది. ఫలితంగా అన్నమయ్య జిల్లాలో అవినీతి చేసిన అధికారులపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసి పేద మధ్య తరగతి ప్రజలందరికీ పక్కా ఇళ్లను నిర్మించాలన్న సంకల్పానికి కొంత మంది అధికారులు తూట్లు పొడుస్తున్నారు. పక్కా భవనం పునాది నుంచి ఇల్లు పూర్తయ్యే వరకు హౌసింగ్ శాఖలోని కొంత మంది ఉద్యోగులు మామూళ్లు ముట్టందే సహకరించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అన్నమయ్య జిల్లా పరిధిలోని ద్వితీయ, తృతీయ శ్రేణిలో ఉన్న అధికారులపై కడప ఏసీబీ అధికారులు ఈ ఏడాది ఏప్రిల్ 6వ తేదీన కేసు నమోదు చేశారు. కేసులో నిందితులుగా ఉన్న అధికారులను ఈ నెల 21వ తేదీన విచారించేందుకు జిల్లా పోలీస్ అధికారుల అనుమతి కూడా పొందినట్లు సమాచారం. జిల్లా పరిధిలోని రాయచోటి, రాజంపేట, పీలేరు ప్రాంతాలలోని అటెండర్లు, డీటీపీ ఆపరేటర్ల అకౌంట్లు, ఫోన్ పేల ద్వారా లక్షలాది రూపాయలను క్షేత్రస్థాయిలోని ఉద్యోగులు, సిబ్బంది నుంచి మామూళ్ల రూపంలో రాబట్టినట్లు ఏసీబీ అధికారులకు సమాచారం ఉంది. ముఖ్యంగా జిల్లాలోని జగనన్న కాలనీల నిర్మాణాలలో ఇసుక, కడ్డీలు, సిమెంట్‌ను లబ్ధిదారులకు ఇవ్వకుండానే పక్కదారి పట్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. లబ్ధిదారులకు అందించిన వాటిలో సగం సిబ్బంది నొక్కేసి వాటి ద్వారా వచ్చిన సొమ్ములో ఉన్నతాధికారులకు వాటాలు పట్టించారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. హౌసింగ్ అధికారుల అవినీతి పెచ్చుమీరడంపై స్థానిక ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా హౌసింగ్ శాఖలో జరుగుతున్న అవినీతిపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఇళ్లను నిర్మిస్తున్న లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో సామగ్రిని, బిల్లులను అందజేసి ప్రభుత్వం అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేసు నమోదు

జిల్లా హౌసింగ్ పీడీ ఆఫీస్‌లో శనివారం జరిగిన సంఘటనపై వర్క్ ఇన్‌స్పెక్టర్ హరి పైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. అదే శాఖలోని హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసును నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ చెప్పారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



తాలూకా పోలీస్ స్టేషన్‌లో పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

మదనపల్లె : కులాంతర వివాహం చేసుకున్న ప్రేమికులు కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందంటూ ఆదివారం తాలూకా పోలీసులను ఆశ్రయించారు. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ తుమ్మల తాండాకు చెందిన శంకరనాయక్ కుమారుడు గణేష్‌నాయక్(22) తిరుపతిలో ఎంబీఏ చదువుతున్నాడు. శ్రీకాళహస్తికి చెందిన సుధాకర్‌గౌడ్ కుమార్తె గీతావాణి తిరుపతిలో ఎంసీఏ చదువుతోంది. ఈ క్రమంలో ఇద్దరూ రెండేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. అయితే గీతావాణి తల్లిదండ్రులకు ప్రేమవివాహం ఇష్టం లేదు. దీంతో గీతావాణి రెండురోజుల క్రితం ఇంట్లో నుంచి పారిపోయి, ఆదివారం మదనపల్లెలోని ప్రియుడు గణేష్‌నాయక్ ఇంటికి వచ్చేసింది. ఇద్దరూ కలిసి పట్టణంలోని అయోధ్యనగర్ రామాలయంలో కులాంతర వివాహం చేసుకున్నారు. గీతారాణి తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉంటుందని భయపడి తాలూకా పోలీసులను ఆశ్రయించి రక్షణ కల్పించాల్సిందిగా కోరారు. ప్రేమికులిద్దరూ మేజర్లు కావడంతో రక్షణ కల్పించనున్నట్లు పోలీసులు తెలిపారు.

బైకును ఢీ కొన్న లారీ

వ్యక్తి దుర్మరణం



దీనంగా చూస్తున్న చిన్నారులు



మృతి చెందిన ఆంజనేయులు

సంబేపల్లె : చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొన్న సంఘటనలో బి. ఆంజనేయులు (40) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు చిన్నమండెం మండలం, మల్లూరు ఎగువగడ్డ దళితవాడకు చెందిన బంగి ఆంజనేయులు తన కుటుంబ సభ్యులతో కలిసి సంబేపల్లె మండలంలోని శ్రీదేవరాయి నల్లగంగమ్మ ఆలయానికి వెళ్లి మొక్కు తీర్చుకున్నాడు. తిరిగి స్వగ్రామానికి భార్య, పిల్లలను ఆటోలో పంపించి ఆంజనేయులు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యంలోని గంగిరెడ్డి చెరువు సమీపంలోకి రాగానే రాయచోటి వైపు నుంచి వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. దీంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య అమరావతి, కుమారుడు యశ్వంత్, కుమార్తె దేవవర్షిణిలు తండ్రి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు.